రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?




మండీబజార్‌లో మరమ్మతులకు నోచుకోని రోడ్డు, డీఎంఎం గేట్ వద్ద పైప్‌లైన్ ఏర్పాటు కోసం రోడ్డును ధ్వంసం చేసి మట్టితో కప్పేసిన దృశ్యం

- పైప్‌లైన్ ఏర్పాటు పేరిట ఛిద్రమవుతున్న సీసీ రోడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో అధ్వానంగా మారిన రోడ్లపై వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైప్‌లైన్ ఏర్పాటు పనుల పుణ్యమా అని లక్షలాది రూపాయల ప్రజాధనంతో వేసిన సీసీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. పైప్‌లైన్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు హడావుడిగా సీసీ రోడ్లను ధ్వంసం చేయడం, పైప్‌లైన్ పనులు పూర్తికాగానే జేసీబీతో మట్టిని కప్పేసి చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకం కింద తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం పట్టణంలోని పలు ఏరియాల్లో ధ్వంసం చేసిన రోడ్లు నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. కాంట్రాక్టర్ చేత రోడ్లకు మరమ్మతు చేయించి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో గగ్గోలు పెట్టినా ఇంజినీరింగ్ అధికారులు పెడచెవిన పెట్టారు. అమృత్ స్కీం కింద జరిగిన పనులు తమకు సంబంధం లేదని, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ వారి పర్యవేక్షణలో జరిగాయి కాబట్టే వారినే అడగాలని ఉచిత సలహాలిస్తున్నారు. తాజాగా గుంతబావి వీధి, ధర్మవరం గేట్ రోడ్డు, అంజుమన్ స్ట్రీట్ ఏరియాల్లో కూడా పైప్‌లైన్ ఏర్పాటు కోసం నాలుగైదు రోడ్లను కాంట్రాక్టర్లు డ్రిల్లింగ్ మిషన్లతో ధ్వంసం చేశారు. ఆ రోడ్లకైనా మరమ్మతులు చేయిస్తారా? లేక జేసీబీతో గుంతలను పూడ్చేసి పత్తాలేకుండా పోతారేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారుల అవస్థలు

అమృత్ స్కీము కింద పట్టణంలోని కసాపురం రోడ్‌లో ఓహెచ్ఎస్ఆర్‌ను నిర్మించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి సదరు ట్యాంక్‌కు నీటి పంపింగ్‌కు పైప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఆ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మస్తాన్‌పేట, డీఎంఎం గేట్ రోడ్డు, మున్సిపల్ వాటర్ ట్యాంక్ రోడ్డు, మండీబజార్, కసాపురం రోడ్‌లలో సీసీ రోడ్లను ధ్వంసం చేశారు. కసాపురం రోడ్ మినహా వాటర్ ట్యాంక్, మస్తాన్‌పేట,మండీబజార్ ఏరియాల్లో ఇప్పటికీ ఆ రోడ్లపై ప్యాచ్ వర్క్‌లు చేయించని కారణంగా గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా చిన్నపాటి వర్షానికే ఆ గుంతల్లో నీళ్లు నిలుస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. భవిష్యత్‌లో ధర్మవరం రైల్వేగేట్ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి పనులు జరిగినట్లయితే తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉండకూడదని భావించి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు రైల్వే పరిసరాల్లో ఉన్న పంపింగ్ మెయిన్ లైన్‌ను షిఫ్టింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. గుంతబావి వద్ద నుంచి డీఎంఎం గేట్ రోడ్డు, అంజుమన్ స్ట్రీట్‌ల మీదుగా మండీబజార్ వాటర్ ట్యాంక్ వరకు సుమారు 210 మీటర్ల మేర మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఆయా ఏరియాల్లోని ప్రధాన రోడ్లను డ్రిల్లింగ్ మిషన్(బ్రేకర్ల)తో ఛిద్రం చేశారు. పనులు పూర్తయిన చోట జేసీబీతో మట్టిని కప్పేశారు. ఇప్పటికైనా .అధికారులు ఛిద్రం చేసిన రోడ్లపై ప్యాచ్ వర్క్‌లు చేయించి నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు అరికట్టండి



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మా వార్డులో వాటర్ ట్యాంక్ ముందు అమృత్ స్కీము కింద పగులగొట్టిన రోడ్లను అలాగే వదిలేశారు. రెండు మున్సిపల్ స్కూళ్లు ఉన్నాయి. నిత్యం భారీ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, నీటి ట్యాంకర్లు తిరిగే రహదారిని మరమ్మతులు చేయించలేదు. ఇప్పుడైనా మున్సిపల్ అధికారులు స్పందించి ధ్వంసం చేస్తున్న రోడ్లను ఆలస్యం చేయకుండా మరమ్మతులు చేయించి ప్రమాదాలను అరికట్టాలి.

– సంపత్ ఆచారి, 21వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, గుంతకల్లు.

మరమ్మతులు చేయిస్తాం



ప్రస్తుతం గుంతబావి నుంచి మున్సిపల్ వాటర్ ట్యాంక్ వరకూ జరుగుతున్న మెయిన్ పంపింగ్ పైప్‌లైన్ ఏర్పాటు కోసం బ్రేకర్లతో పగులగొట్టిన రోడ్లను తప్పనిసరిగా బాగు చేయిస్తాం. అందుకోసం రూ.16.50 లక్షలతో అంచనాలు తయారు చేశాం. ఈ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం అయ్యాక, టెండర్లు పిలిచి ప్యాచ్ వర్క్‌లు చేయిస్తాం. గతంలో అమృత్ స్కీం కింద జరిగిన పనులు పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు చేయించారు కాబట్టి వాటి గురించి వారినే అడగాలి.

– లీలాకృష్ణ ప్రసాద్, మున్సిపల్ ఈఈ, గుంతకల్లు

క్లుప్తంగా

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ హేమచంద్ర, మున్సిపల్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మహిళలకు స్వయం ఉపాధిని కల్పించే క్రమంలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐఓసీ సీనియర్ డిపో మేనేజర్ హరీష్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఐఓసీ ఆధ్వర్యంలో రూ.44 లక్షల వ్యయంతో నక్కనదొడ్డి తండా గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ వరలక్ష్మితో కలసి ఆయన ప్రారంభించారు. శిక్షణకు హాజరయ్యే మహిళలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా అనిల్‌కుమార్‌నాయక్



తాడిపత్రి రూరల్: తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా అనిల్‌కుమార్‌నాయక్‌ను నియమిస్తూ మంగళవారం హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రెండో అడిషనల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌నాయక్‌ను తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న క్రిష్ణవేణి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఒకటో అడిషనల్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు.

గేట్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం అనంతపురం మానవతా బ్లడ్ డోనర్స్ సంస్థ, ఆర్డీటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గేట్స్ డైరెక్టర్ వాణి రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించారు. గేట్స్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు సుమారు 100 మంది రక్తదానం చేశారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నవారు ప్రతి 90 రోజులకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మానవతా డోనర్స్ సంస్థ ప్రతినిధి అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్డీటీ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



సబ్ జైలును తనిఖీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివ ప్రసాద్‌యాదవ్, ఆరో అదనపు జిల్లా జడ్జి సాధు బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సబ్ జైలు లోని వంట గదులు, బ్యారెక్కులు, బాత్ రూమ్‌లు, స్టోర్ రూమ్ పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించారు. జైల్లో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరిండెంటెంట్ మహేశ్వరుడు, న్యాయవాది గంగాధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



అంజినమ్మ పొలంలో విచారణ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు

పెద్దవడుగూరు: రైతుల సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలని పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, తహసీల్దార్ ఉషారాణి సూచించారు. మండలంలోని కండ్లగూడూరు గ్రామానికి చెందిన మహిళా రైతు అంజినమ్మ తన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో తక్కువగా చూపుతోందని కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలనకు దిమ్మగుడి కి వచ్చారు. ఈ సందర్భంగా అంజినమ్మ పొలానికి చుట్టూ ఉన్న రైతులకు నోటీసులు ఇచ్చి పిలిపించారు. ఈ సందర్భంగా ఇద్దరు రైతుల భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించి, సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకొన్నారు. ఇరువర్గాల వారు సమ్మతించడం తో భూమి సమస్య పరిష్కారమైనట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లహరిక, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందువుల నిరసన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న హిందూ ఐక్య అనుబంధ సంస్థల ప్రతినిధులు

గుత్తి: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ మంగళవారం గుత్తిలో హిందూ ఐక్య అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి హిందూ ఐక్య అనుబంధ సంస్థల ప్రతినిధులు కొత్రికె మధుసూదన్ గుప్తా, రమణ, తిమ్మారెడ్డి, వెంకప్ప, నాగయ్య, పాటిల్ సురేష్, నారాయణ, మంజు, సంపత్, ఆకుల మురళీ, బాలకృష్ణ, కృష్ణయ్య తదితరుల ఆధ్వర్యంలో రాయల్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. జై భారత్ మాతాకీ, హిందువులపై దాడులు నశించాలని అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య అనుబంధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో హిందువులను ఊచకోత కోస్తున్నా అక్కడి ముఖ్యమంత్రికి గాని, ప్రభుత్వానికి గాని చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా నున్న కేజీబీవీ టైపు-4 వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు అర్హులన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్‌చే ధ్రువీకరించబడిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలు జత చేసిన దరఖాస్తులను వసతి గృహంలో అందజేయాలన్నారు.

నాన్ టీచింగ్ పోస్టులకు..

గుత్తి: పట్టణంలోని కేజీబీవీలో నాన్ టీ చింగ్ స్టాఫ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రవినాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు..

గుంతకల్లుటౌన్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం మే 10లోగా ఏపీఎంఎంఎస్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, మెప్మా టీపీఆర్ఓ మోహన్ మంగళవారం తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన (వృత్తిదారులు, వ్యాపారులు, నిరుద్యోగ యువతీ, యువకులు) 44 మందికి స్థానిక బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: అనంతపురం సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికాలయం, ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరు పోస్టులకు నిరుద్యోగ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ జయానాయక్ మంగళవారం తెలిపారు. స్థానిక కేజీబీవీలో టైప్-3 పోస్టులైన హెడ్ కుక్-1, స్కావేంజర్-1 పోస్టులకు, స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో టైప్-4 పోస్టులైన చౌకీదార్-1, హెడ్‌కుక్-1, అసిస్టెంట్ కుక్-2 చొప్పున మొత్తం ఆరు పోస్టులకు దరఖాస్తులను ఈనెల 30లోపు ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

విలేకరి ఇంటిపై దాడి దుర్మార్గం

యాడికి: టీడీపీకి చెందిన కొందరు రౌడీ షీటర్లు ఓ దిన పత్రిక విలేకరి రామకృష్ణపై దాడి చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, ఈడిగ కులస్తులు మండిపడ్డారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇంటిపై నిద్రిస్తున్న విలేకరి దంపతులపై గాజు సీసాలతో దాడులు చేశారన్నారు. వారి ఆగడాలను వార్తల రూపంలో వెలికితీస్తుండడంతో దాడి చేశారన్నారు. నిందితులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

పిల్లలను సమానంగా చూడాలి

గుంతకల్లుటౌన్: ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక బీటీ పక్కీరప్ప కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పీసీ పీఎన్‌డీటీ చట్టంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మల, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు రాయితీలను కల్పిస్తామని మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో రైతులకు ఉద్యాన పంటల సాగు, రాయితీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీకేఎస్, శింగనమల రైతులు పాల్గొన్నారు.

మెకానిక్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడుకు చెందిన మెకానిక్ షేక్షావలిపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడారు. వివరాలు.. షేక్షావలి స్థానిక లత లాడ్జి వద్ద ఉండగా నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చి హైస్కూల్ గ్రౌండ్‌లోకి తీసుకువెళ్లారు. మరో పది మందితో కలిసి అతడిని చితకబాదారు. తీవ్రంగా గాయపడిన అతడు పట్టణంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే దాడి ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయలేదు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

పుట్లూరు: మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైందని పోలీసులు తెలిపారు. మండలంలోని జి.వెంగన్నపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన విషయం విదితమే. కాగా మంగళవారం పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి నార్పల మండలం పులతనూతల గ్రామానికి చెందిన వీరనారప్ప(74)గా అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు. వీరనారప్ప కొంతకాలంగా మానసికస్థితి బాగా లేక తిరిగేవాడని పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

పుట్లూరు: పోటీ పరీక్షలకు సంబంధించి నిరుద్యోగులకు ఉపయోగపడేలా రూ.50వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందించిన పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడును మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమ్‌కుమార్, గ్రంథాలయ అధికారి జయరాములు, మడ్డిపల్లి జగదీశ్వరరెడ్డి, పుట్లూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సామగ్రి అందజేత

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో మంగళవారం ఎన్‌సీసీ ప్రథమ సంవత్సరం క్యాడెట్లకు ఎన్‌సీసీ యూనిట్ అధికారి వై.రామాంజనేయులు, హెచ్ఎం కే రామ్‌కుమార్ సమక్షంలో ఈఓ ఎం .గోపాల్ యూనిఫామ్, ట్రాక్‌సూట్, టీషర్టు పంపిణీ చేశారు. అంతకుముందు స్కూల్ ఎదుట బీసీసీ రోడ్డుపై విద్యుత్ స్తంభానికి ఎన్‌సీసీ సూచికబోర్డు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి బీ లక్ష్మీనారాయణ, పత్రా శ్రీనివాసులు, షఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకులపై దాడి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని కడప రోడ్డు గురు లాడ్జ్ వద్ద హోటల్ నిర్వాహకులపై దాడి జరిగిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం తాడిపత్రి మండలం వంగనూరుకు చెందిన తలారి ఆంజనేయులు హోటల్ ఎదురుగా ఆటో ఆపుకొని అదే గ్రామానికి చెందిన శివారెడ్డి కోసం ఎదురు చూస్తున్నాడు. హోటల్‌కు అడ్డుగా ఉందని హోటల్ నిర్వాహకులు సురేష్, విజయ్ ఆంజనేయులుతో వాగ్వాదానికి దిగడంతో ఘర్షణకు దారి తీసింది. ఈ విషయం ఫోన్‌లో తన గ్రామస్తులకు తెలపగా మరో ఆరుగురితో వచ్చి హోటల్ నిర్వాహకులపై దాడి చేశారు. ఘటనలో సురేష్, విజయ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎంఐఎస్ నిర్వహణపై శిక్షణ

గుంతకల్లుటౌన్: హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్ఎంఐఎస్)తో పాటు ఆర్‌సీహెచ్ పోర్టల్ నిర్వహణపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి డీపీఎంయూ డాక్టర్ రవిశంకర్, జిల్లా గణాంక అధికారి మహమ్మద్ రఫీ, డీపీఓ కిశోర్ కుమార్ హాజరై ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు, మాతా శిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య సేవా కార్యక్రమాలు, మాతాశిశు మరణాలు, క్వాలిటీ కంట్రోల్ తదితర సేవల వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, సీహెచ్ఓ, ఎంపీహెచ్ఓ, ఫార్మసిస్టు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డీఈఓలు పాల్గొన్నారు.

పీహెచ్ఆర్‌సీ గుర్తింపు కార్డుల పంపిణీ

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పీపుల్స్ హ్యూమన్ రైట్స్ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పేరం సుధాకర్‌రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రటరీ గుండా నారాయణ స్వామి, జిల్లా లేబర్ రింగ్ పార్లమెంట్ ప్రెసిడెంట్ రంగారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ కొత్త సభ్యులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు రామిరెడ్డి, చంద్ర శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, తిరుమలేసి, గణేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు: మండలంలో ఇటీవల కురిసిన గాలీవానకు పండ్ల తోటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అప్పేచర్లలో గాలీవాన బీభత్సానికి విరుపాక్షిరెడ్డి తోటలో దెబ్బతిన్న బొప్పాయిచెట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హార్టికల్చర్ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. ఎకరానికి రూ. 50 వేలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు పోలా రంగస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట 25న ఆందోళన

గార్లదిన్నె: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణలకు వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్‌ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై నేడు సమావేశం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో బుధవారం ఉదయం 11 గంటలకు కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలని ముతవల్లి బీకే రహీమ్, సీపీఐ సీనియర్ నాయకుడు రహీమ్ మంగళవారం తెలిపా రు. ముస్లిం సమాజ్, మసీదుల అభ్యున్నతికి దాతలు ఇనామ్‌గా ఇచ్చిన భూములను ప్రభుత్వానికి ధారాదత్తం చేసేలా ప్రవేశపెట్టిన ఈ చట్టాన్ని నిరసిస్తూ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ముస్లిం మైనార్టీలను అణగదొక్కాలన్న బీజేపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ముస్లిం , క్రిస్టియన్ మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా సాగిస్తున్న కమలం పార్టీ నియంతృత్వ పాలనపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు, మతసామరస్యవాదులు పెద్దత్తున హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరారు.

విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరం



ప్రాజెక్ట్ వివరాలను వెల్లడిస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక, నైపుణ్యాలతో కూడిన విద్య ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు ఐఎస్‌టీఈ స్టూడెంట్ చాప్టర్‌తో కలసి మినీ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ హెచ్ఓడీ వినోద్‌కుమార్, పోగ్రాం సమన్వయ కర్త పద్మావతి పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసిన ‘కూటమి’



పాదయాత్ర చేపడుతున్న సీపీఐ నేతలు

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని వ్యవసా య కార్మిక సంఘం, సీపీఐ నేతలు మండిపడ్డారు. మండల కేంద్రంలోలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనంతపురం వరకూ పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ నేతలు మాట్లాడుతూ నార్పల మండలంలోని బండ్లపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉపాధి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కూలీలకు సక్రమంగా బిల్లులు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, అధ్యక్షుడు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, మండల కార్యదర్శి మద్రిస్వామి, శ్రీనివాసరావు, నాగేంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, ఈసీ ప్రభాకర్, టీడీపీ నాయకులు ఎంకే.చౌదరి, చికెన్ శీనా, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



పామిడిలో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థినులు

పామిడి/పుట్లూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ సూచించారు. మంగళవారం ఎద్దులపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పామిడి మండలంలోని మోడల్‌స్కూల్‌లో బాల్య వివాహాల నిర్మాలనపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతో పాటు హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం.స్కూల్ ఆవరణలో విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలను అరికడదామంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలకేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో మంగళవారం బాల్య వివాహాలపై వైద్యాధికారి శ్రీవాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.